క్లుప్తంగా

ఆలయాల్లో అన్నదానం

కాకినాడ రూరల్: దసరా ఉత్సవాలు ముగియడంతో కాకినాడ రూరల్ రమణయ్యపేట గ్రామ పరిధిలోని కనకదుర్గ అమ్మవార్ల ఆలయాల వద్ద బుధవారం భారీగా అన్నదానం నిర్వహించారు. గ్రామంలోని కూరగాయలు మార్కెట్ వద్ద వర్తకులు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. గ్రామస్తులు, స్థానికులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఏపీఐఐసీ కాలనీ వద్ద కనకదుర్గమ్మ ఆలయం వద్ద నిర్వహించిన అన్నదానంలో గ్రామస్తులు, కాలనీ వాసులు అన్నప్రసాదం స్వీకరించారు.

పారిశుధ్య పనుల తనిఖీ



పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ సుధాకర్

బోట్‌క్లబ్: నగరంలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ఇన్‌చార్జి కమిషనర్ కేటీ సుధాకర్ తనిఖీ చేశారు. స్థానిక 11వ శానిటేషన్ సర్కిల్ పరిధిలోని వార్ఫురోడ్డు, జిల్లా పరిషత్ ప్రాంతాలను, 14వ సర్కిల్ పరిధిలోని గైగోలుపాడు ప్రాంతాల్లో పనులు పరిశీలించారు. శానిటేషన్ పనుల నిర్వహణపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటేషన్ ప్రమాణాలు మెరుగుపడకుండా కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. 12వ సర్కిల్‌లోని మస్టర్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులు హాజరు పట్టిని పరిశీలించారు. ఈ తనిఖీల్లో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు సత్తిబాబు, దుర్గారావు పాల్గొన్నారు.

ఆడియోమెట్రీ యూనిట్ ప్రారంభం



యూనిట్‌ను ప్రారంభిస్తున్న లావణ్యకుమారి

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో బ్రెయిన్ స్టెమ్ ఎవోక్డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ యూనిట్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి బుధవారం ప్రారంభించారు. అలాగే పునరుద్ధరించిన సౌండ్ ప్రూఫ్ ఆడియోమెట్రీ గది సేవలు ప్రారంభమయ్యాయి. వీటి వల్ల నవజాత శిశువులు, పిల్లలు, మానసిక లోపంతో బాధపడుతున్న వారితోపాటు వినికిడి సమస్య ఉన్న వారికి ఎంతో ప్రయోజనం చేకూరనుందని తెలిపారు. ఈఎన్‌టీ హెచ్‌వోడీ డాక్టర్ విజయదీప్తి తదితరులు పాల్గొన్నారు.

కార్తిక మాసంలో పంచారామాలకు ప్రత్యేక బస్సులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కార్తికమాసం సందర్భంగా పంచారామాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, నవంబర్ 2, 9, 16 తేదీల్లో ఏలేశ్వరం, కాకినాడ, తుని డిపోలు నుంచి ఆదివారం రాత్రి బస్సులు బయలుదేరి సోమవారం రాత్రికి తిరిగి చేరుకొంటాయన్నారు. ప్రత్యేక బస్సుల్లో ప్రయాణానికి అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్తీక మాసంలో కాకినాడ నుంచి శ్రీశైలం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. శబరిమల యాత్ర చేసే అయ్యప్ప స్వాములకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. ప్రత్యేక బస్సులు కావాల్సిన వారు ఆయా డిపోల్లో సంప్రదించాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైకులు నడిపిన కేసుల్లో ఒకరికి ఒక్క రోజు, ఇద్దరికి రెండు రోజుల చొప్పున జైలు, మరో ఏడుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.ఉషాలక్ష్మి కుమారి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వారిలో పది మందిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా పైవిధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

బాణసంచా దుకాణాలకు దరఖాస్తులు

కొత్తపల్లి: దీపావళి బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని తహసీల్దారు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో దుకాణాలు ఏర్పాటుపై బుధవారం ఆయన మాట్లాడుతూ దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు అగ్నిమాపక, పోలీసులు శాఖలకు సంబంధించిన అనుమలుతు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా షాపులను ఏర్పాటు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మందుగుండు సామగ్రిని అక్రమంగా నిల్వ ఉంచినా చర్యలు తప్పవన్నారు. ఏ ప్రమాదం సంభవించినా దానికి పూర్తి బాధ్యత నిర్వాహకులే వహించాలన్నారు. ఇప్పటి వరకూ 8 దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతుల కోసం దరఖాస్తులు అందాయని వీటిని గ్రామ రెవెన్యూ అధికారి పోలీసులతో దుకాణాల ఏర్పాటు పరిశీలన చేసిన తరువాత మాత్రమే నివేదికను ఉన్నతాధికారులకు అనుమతుల ప్రకారం మంజూరు చేస్తామన్నారు. మూలపేట-3, వాకతిప్ప-2, కొండెవరం-1, కొత్తపల్లి-2 దరఖాస్తు అందిందన్నారు. అనుమతులు పొందిన వారు నిబంధనలు పాటించాలన్నారు.

రీలా.. రియలా..

- నగరంలో విస్తృతమవుతున్న సోషల్ మీడియా ప్రచారాలు
- రీల్స్, షార్ట్స్‌తో వ్యాపార ప్రకటనలు
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు చక్కటి సంపాదన
- ఈ ప్రకటనలు నమ్మి ఒక్కోసారి సామాన్యులు బురిడీ



బ్యాగ్స్ షో రూమ్‌లో రీల్స్ కోసం వీడియో తీస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్

కాకినాడ క్రైం: నగరంలో సోషల్ మీడియా ప్రచారాలు విస్తృతమవుతున్నాయి. సరదాగా చేస్తున్న ప్రచారాలు కాస్తా రూపు మార్చుకుని ప్రకటనలుగా మారుతున్నాయి. ఈ ప్రచారాల కొంత మందికి కాసులు కురుస్తున్నాయి. వాటిని చూసి వ్యాపారులు తమకు అనువుగా మార్చుకుంటున్నారు. ఈ రీల్స్, షార్ట్స్‌లో చేసే ప్రకటనలను చూసి ప్రజలు నమ్మి మోసాలకు గురవుతున్నారు. దీంతో ఏదినమ్మాలో ఏది నమ్మకూడదో తెలియని పరిస్థితిలో ఉంటున్నారు. అసలు ఏది రీలో ఏది రియలో అనేది తెలియని ఓ గందరగోళంలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఫోన్ తీస్తే వచ్చి షార్ట్స్, రీల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు.

ఓ జీవనోపాధిగా..

ఇన్‌స్టాగాం, ఫేస్ బుక్ రీల్స్, యూట్యూబ్ లాగ్స్ చేసే వారికి ఇది ఓ జీవనాధారంగా మారింది. వీరిని సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లుగా పిలుస్తుంటారు. రీల్స్, షార్ట్స్ సృష్టించేందుకు విద్యార్హతతో పనిలేదు. దీంతో ప్రతి ఒక్కరూ వారిలో సృజనాత్మకత బయటకు తీస్తూ వైరల్ అవుతున్నారు. సెలబ్రిటీలుగా మారిపోతున్నారు. దీంతో వారికి ఉపాధి అవకాశాలు కూడా వస్తున్నాయి. దీనిని వేదికగా చేసుకుని కొంత మంది వ్యాపారులు సందడి చేస్తున్నారు. కొత్త కొత్తగా ప్రకటనలు చేస్తున్నారు. ఎవరి సృజనాత్మకతను వారు రంగరించి యాజమాన్యం మన్ననలు పొందేలా ప్రమోషనల్ వీడియోలు చేస్తుంటారు. ఇలా ఓ వర్గంగా ఏర్పడి చేసే రీల్స్‌కు వీరిలో ఓ వ్యక్తి అందరి అనుమతితో ధర నిర్ణయించి అందరి తరఫున ఒకరే వసూలు చేసి పంచుతారు.

కాకినాడలో 20 మందికిపైగా..

కాకినాడలో పాపులారిటీ సంపాదించుకున్న 20 మందికి పైగా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు ఉన్నారు. వీరి ఒకొక్కరి ఆదాయం నెలకి కనీసం రూ.20 నుంచి రూ.50 వేల మధ్య ఉంటుంది. వీరిలో ఒకొక్కరికి 50 వేల నుంచి లక్ష మంది వరకు ఫాలోయర్లు ఉన్నారు. ఒక వీడియోను సిద్ధం చేసేందుకు వ్యాపారి నుంచి వీరు కనీసం రూ.2 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తారు.

అవగాహన లోపం

సోషల్ మీడియా సామాన్యుల జీవితాలపై ఏ స్థాయి ప్రభావాన్ని చూపుతుందో తెలియనిది కాదు. అటువంటి పరిస్థితి పలుమార్లు ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తోంది. పాపులర్ ఇన్‌ఫ్లూయెన్సర్లు చేసే వీడియోలతో ప్రభావితమవుతున్న ప్రజలు కొనడానికో, తినడానికో వెళ్లి అక్కడ వీడియోలో చూపుతున్న స్థాయి సంతృప్తి పొందలేకపోతున్నామనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రీల్స్‌లో చూసి వచ్చామని ఇక్కడ అంతలేదని నేరుగా కస్టమరే కౌంటర్‌లో ఉండే యజమానితో చెప్పి వెళ్లిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్టణం వెళ్లే మార్గంలో రాష్ట్రంలోనే పెద్ద రెస్టారెంట్ అంటూ ఓ ఆహార సుముదాయం వెలసింది. ఆ రెస్టారెంట్ యజమాని ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు కావడంతో విపరీతమైనా పాపులారిటీ తీసుకొచ్చారు. మధ్యాహ్నం భోజనానికి వెళితే సాయంత్రం 5 గంటలకు స్లాట్ ఇచ్చేవారు. ఇదంతా రీల్స్, షార్ట్స్ ప్రభావమే. నెల రోజులు గడచిందో లేదో వ్యాపారం తగ్గుతూ వచ్చింది.

వాస్తవ కంటెంట్ ఇవ్వాల్సిందే..



సోషల్ మీడియా ఎంత పాపులారిటీ తెచ్చిపెడుతుందో అంతే త్వరగా తెరమరుగున పడుతుంది. పోస్టులో విషయం లేకపోతే ప్రచారం నీరుగారిపోతుంది. రీల్స్, షార్ట్స్ వల్ల వ్యాపారులు తక్కువ ఖర్చుతో ప్రచారం చేసుకోవచ్చు. అయితే నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే అది వెంటనే మూతబడిపోతుంది. అందుకే ప్రజలు మనల్ని నమ్మి ఫాలో అవుతుంటే వారికి వాస్తవిక కంటెంట్ ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంటుంది.

– సూర్య ఆకొండి, నటుడు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్

తప్పుదోవ పట్టిస్తే నేరమే..



రీల్స్, షార్ట్స్ ద్వారా తప్పుడు కంటెంట్‌ను ప్రచారం చేసి ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తే అది క్రిమినల్ నేరమవుతుంది. కనీసం రెండేళ్ల జైలు శిక్ష ఉంటుంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సామాజిక బాధ్యత పాటించాలి. వేలాది మంది ఫాలో అవుతూ ఉంటారు. అటువంటి వేదిక మంచిని, నిజాన్ని ప్రచారం చేసేదిగా ఉండాలి. తప్ప ఆర్థిక పరమైన ప్రయోజనాలు, ఇతర కారణాలతో ప్రజలను మోసం చేయకూడదు. అలా మోసపోయిన ప్రజలు పోలీసుల్ని ఆశ్రయించి ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.

– దేవరాజ్ మనీష్ పాటిల్, డీఎస్పీ, ఏఎస్పీ కాకినాడ

రీల్ చూసి వెళితే..



కాకినాడ ముత్తా వంతెన సర్కిల్ సమీపంలో ఇటీవల ఓ రెస్టారెంట్ వెలసింది. రీల్స్‌లో పాపులర్ అయితే చూసి వెళ్లాను. చేదు అనుభవం ఎదురైంది. అక్కడ ఆహారం ఏ మాత్రం బాగోలేదు. ధరలు కూడా అధికంగా ఉన్నాయి. రీల్స్‌లో ఫుడ్ ఆహా ఓహో అన్నారు, అది చూసి వెళ్లి మోసపోయాను. సోషల్ మీడియా ప్రచారాలు చూసి మోసపోవద్దు.

– బత్తుల మణికంత, కాకినాడ వాసి

రాజకీయ అజ్ఞాని షర్మిల



బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్

బోట్‌క్లబ్: రాజకీయంగా అవగాహన లేకుండా మాట్లాడుతున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రాజకీయ అజ్ఞాని అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ విమర్శించారు. టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో దళిత వాడల్లో వేంకటేశ్వర స్వామి ఆలయాలు నిర్మాణాలు చేయడానికి మీరెవరని మొన్న ప్రశ్నించిన షర్మిల, నేడు జీఎస్టీ అంటే గబ్బర్ సింగ్ టాక్స్ అని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గురువారం ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలుకి వస్తుంటే షర్మిల ఆ పర్యటనపై అవాకులు చవాకులు మాట్లాడడాన్ని రవికిరణ్ కాకినాడలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఖండించారు. గబ్బర్ సింగ్ టాక్స్ అయితే దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి 2006లో తన బడ్జెట్ ప్రసంగంలో అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరం ద్వారా ఎందుకు ప్రతిపాదన చేశారని దాని ఆవశ్యకతని ఎందుకు దేశ ప్రజల ముందు ఉంచారని రవికిరణ్ ప్రశ్నించారు. దేశం మొత్తం ఒకే పన్ను విధానాన్ని ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక సమగ్ర స్వరూపం తీసుకొచ్చి ఈరోజు దేశంలో సమర్థవంతంగా అమలు చేసి చక్కటి ఫలితాలు పొందుతుంటే దేశ అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక షర్మిల ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. నిజంగా జీఎస్టీ విధానం తప్పుడు విధానం అయితే 2016 నుంచి ఇప్పటివరకు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు ఎందుకు మద్దతుగా నిలబడుతున్నాయని ఎందుకు దీన్ని వ్యతిరేకించలేదని రవికిరణ్ ప్రశ్నించారు.

రేపు నయన శ్రీరామ్‌కు రోటరీ గోల్డ్ పురస్కారం

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సీనియర్ సభ్యుడు, నయన కంటి హాస్పిటల్ అధినేత డాక్టర్ రావుల శ్రీరామ్‌కు రోటరీ గోల్డ్ పురస్కారం వరించింది. శుక్రవారం అవార్డుతో ఆయనను సత్కరించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆప్తమాలజీ సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీరామ్ కంటి వైద్య చికిత్స విషయంలో తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. సామాజిక సేవా కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాక ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి కంటి వైద్య చికిత్సను ఉచితంగా అందిస్తూ సామాజిక సేవ చేస్తున్నారు. కాకినాడలో 28 సంవత్సరాల క్రితం నయన కంటి ఆసుపత్రి ఏర్పాటు చేశారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్‌తో పాటు ఇతర స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలతో పాటు మురికివాడల్లో ఐ క్యాంపులు నిర్వహిస్తున్నారు. వీరి సామాజిక సేవా కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం గుర్తించి ఇటీవల స్వాతంత్ర దినోత్సవం రోజు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డుతో సత్కరించారు.

మూడు నెలలకోసారి ఓటర్ల జాబితా అప్‌డేట్

రాజకీయ పార్టీల సమావేశంలో అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారి కుమారి



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఏఈఆర్వో కుమారి

కాకినాడ రూరల్: ఓటర్ల నమోదును నిరంతరం కొనసాగిస్తూనే ప్రతి మూడు నెలలకు ఒకసారి అప్‌డేట్ చేయనున్నట్టు మార్పులు, చేర్పులు, తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులను కాకినాడ రూరల్ తహసీల్దార్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్ఎల్ఎన్ కుమారి కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని, త్వరలో స్పెషల్ ఇన్‌టెన్సివ్ సమ్మరీ రివిజన్ ప్రారంభమవుతుందని తెలియజేశారు. రూరల్ నియోజకవర్గంలోని పేదరిక నిర్మూలన పార్టీ గుర్తింపును కేంద్ర ఎన్నికల సంఘం శాశ్వతంగా రద్దు చేసిందన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు కల్యాణ్ చక్రవర్తి, సురేష్‌కుమార్, ఆర్ఐ భవాని, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు ఎస్.అప్పారావు, కేవీ రంగరామయ్య, గదుల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలి

బోట్‌క్లబ్: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం కాకినాడ కమిటీ సమావేశం బుధవారం స్థానిక బాల భవన్ వద్ద నిర్వహించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను నవంబర్ 3వ తేదీ లోపు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. గురువారం గాంధీ విగ్రహాలకు సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేస్తామని, 22న కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా, 25న కార్పొరేషన్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ, 27న ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనాలు అమలు చేయాలని, కాకినాడ స్పెషల్ శానిటేషన్ కార్మికులను, టాయిలెట్ కార్మికులను ఆప్కాస్‌లో విలీనం చేయాలన్నారు. బకాయి జీతాలు చెల్లించాలి, పర్మనెంట్ కార్మికులకు బకాయి డీఏ, సరెండర్ లీవ్‌లు తక్షణమే చెల్లించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 11 పీఆర్సీ అమలు చేయాలని కోరుతూ చేస్తున్న సమ్మెకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి తుపాకుల లక్ష్మీనారాయణ, యూనియన్ నాయకులు బొబ్బిలి ఈశ్వరరావు, సింగంపల్లి రమణ, బంగారు రాజేష్, నిమ్మకాయల ఈశ్వరరావు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం ఆదర్శప్రాయుడు



గురజనాపల్లి హైస్కూల్‌లో అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బోట్‌క్లబ్: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం గొప్ప దార్శనికుడు, మార్గదర్శి అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.పద్మరాజు పేర్కొన్నారు. స్థానిక వివేకానంద పార్కులో బుధవారం ది కాకినాడ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం 94వ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్వయం కృషి, స్వీయ ప్రతిభతో ఒక సామాన్యుడు, అసామాన్యుడు కాగలడని కలాం నిరూపించారన్నారు. అలాగే రామేశ్వరం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు పోగలడని, ఒక పేపర్ బాయ్ శాస్త్రవేత్త కాగలడని భారత మాజీ రాష్ట్రపతి కలాం నిరూపించారన్నారు. కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి అని కలాం ఇచ్చిన సందేశం ప్రపంచ వ్యాప్తంగా యువతకు తారక మంత్రంలా పని చేసిందన్నారు. రక్షణ, అంతరిక్ష, వైద్య, మానవ రంగాల కోసం కృషి చేసిన శాస్త్రవేత్త అన్నారు. ఆయన నిత్య విద్యార్థి అని అందుకే అబ్దుల్ కలాం జన్మదినమైన అక్టోబర్ 15ను అంతర్జాతీయ విద్యార్థి దినంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో ది కాకినాడ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గ్రంధి బాబ్జి, సెక్రటరీ భూస్వామి, ఉపాధ్యక్షుడు నరసింహారావు, గుర్రం సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ వీర కోటేశ్వరరావు, ట్రెజరర్ తాళ్లూరి కనకరాజు పాల్గొన్నారు.

కరప: గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులతో కలిసి హెచ్ఎం ఎ.సాయిమోహన్ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సాయిమోహన్ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విశిష్టసేవలందించిన అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కలలు కనండి, వాటిని సార్థకం చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. పృథ్వీ, అగ్ని, ఆకాష్, త్రిశూల్ వంటి క్షిపణులు అందించిన అబ్దుల్‌కలాం దేశప్రతిష్ఠను ఇనుమడింప చేశారని పలువురు కొనియాడారు. మిసైల్ మ్యాన్ ఆఫ్‌ది ఇండియాగా పిలిచే అబ్దుల్ కలాం ఆదర్శ ప్రాయుడన్నారు. స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి మాజీరాష్ట్రపతి అబ్దుల్ కలాం బహుముఖ ప్రజ్ఞను గుర్తించి, ఆయన జయంతిని అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవంగా ప్రకటించాలన్నారు. తర్వాత పాఠశాలలో అతర్జాతీయ చేతి పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించి, హెచ్ఎం సాయిమోహన్ విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నాగలింగేశ్వరరావు చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని చేసి చూపించారు. ఉపాధ్యాయులు టి.వేణుగోపాల్, వీవీ రమణమూర్తి, వీజే శుభాకర్, దిల్షాన్‌ఖాన్, ఎస్.ఉమామహేశ్వరరావు ఎం.ప్రభారాణి, సీహెచ్ పద్మావతి, పి.భవాని తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మర్చంట్ అసోసియేషన్ నాయకులు

ఓటరు జాబితా అవకతవకలపై సంతకాల సేకరణ



కాకినాడలో సంతకాల సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోట్‌క్లబ్: ఓటరు జాబితా అవకతవకలపై చేస్తున్న ఉద్యమంలో భాగంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు కాకినాడలో కేంద్ర మాజీమంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు సంతకాల సేకరణ చేపట్టారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు కార్యకర్తలతో పెద్ద ఎత్తున పాదయాత్ర చేపట్టి ప్రజలకు అసలు ఓటర్లను ప్రభుత్వాలు ఏ విధంగా మోసం చేస్తున్నాయో వివరించారు. ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సేకరణలో భాగంగా నగరంలో ఉన్న ప్రముఖులు పళ్లంరాజును కలిసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు చెక్క నూకరాజు, నాయకులు మట్ట ప్రసాద్, యాళ్ళ రామకృష్ణ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఏడీఈఎన్ బి.శివప్రసాద్ ఎంతో కృషి చేశారని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. ఏడీఎన్ బదిలీ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏఈడీఎన్ శివప్రసాద్ భీమవరం బదిలీ కాగా అతని స్థానంలో కర్నూల్ జిల్లా గుత్తి నుంచి పి.ప్రభాకరరావు ఏడీఎన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కొత్త ఏడీఈఎన్‌కు రైల్వే అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

బాలికల హక్కులను కాపాడుకోవాలి

జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ దుర్గారాణి

పిఠాపురం: బాలికల హక్కులను కాపాడుకోవాలని వారిపై ఉన్న లింగ అసమానతలను తొలగించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి సూచించారు. మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ దుర్గాదేవి ఆధ్వర్యంలో గొల్లప్రోలు బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పిఠాపురం, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్తంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, బాల్యవివాహాలు వల్ల జరిగే అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి బాలికల దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వేడుకలు అక్టోబర్ 11 నుంచి 18 వరకు జరగనున్నాయని ఈ సమావేశాలలో బాలికలకు వ్యాసరచన పోటీలు, ఆటల పోటీలు కూడా నిర్వహించి వారికి అధికారులతో బహుమతులు అందజేయనున్నారని ఆమె తెలిపారు. మండలంలో పలు పాఠశాలలలో బాలికలకు వ్యాసరచన పోటీలు ఆటపాటల పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మానసాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ సూర్య ప్రకాశరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ రాజీనామా ఉపసంహరణ

పెద్దాపురం (సామర్లకోట): మున్సిపల్ కౌన్సిలర్ పార్టీ సీనియర్ నాయకుడు ఆరెళ్ల వీరరాఘవులు రాజీనామాను ఉపసంహరణ చేసుకున్నారని పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ తెలిపారు. పట్టణానికి చెందిన ఒక విలేకరి వీరరాఘవులను ఇబ్బందులకు గురి చేయడంతో వైఎస్సార్ సీపీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారని, అయితే ఆ విలేకరిపై పత్రికా యాజమాన్యం చర్యలు తీసుకోవడంతో రాజీనామా ఉపసంహరించుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వీరరాఘవులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నానని మున్సిపల్ వైస్‌చైర్మన్ సూచన మేరకు రాజీనామాను ఉపసంహరించుకొని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో కౌన్సిలర్లు తల్సిక సత్యభాస్కరరావు, కోటి పవన్, గుర్రాల యాకోబ్, కోఆప్షన్ సభ్యుడు ఎస్కే రఫీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు రూ.10.71 కోట్లు

సామర్లకోట: మండల పరిధిలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31వతేదీ వరకు జరిగిన 944 ఉపాధి హామీ పనులకు సంబంధించి రూ.10,71,42,448 ఖర్చు చేసినట్టు జరిగిందని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మెటీరియల్ రూపంలో రూ.3,83,61,588, వేతన రూపంలో రూ.6,87,80,860 ఖర్చుచేయగా సామాజిక తనిఖీల బృందం రూ.1,72,224 రికవరీ చేసినట్టు తెలిపారు. మండల స్థాయిలో ఈనెల ఒకటి నుంచి 13 వరకు ఆయా గ్రామాలలో సామాజిక బృందాలు ఉపాధి హామీ పనులను తనిఖీ చేశాయన్నారు.